క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడు వైఎస్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరయ్యారు. రాజుపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగసుబ్బారెడ్డి కుమార్తె సుకన్య, అన్నవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెడ్డి కుమారుడు వెంకట సుదర్శన్‌రెడ్డిల వివాహాన్ని వైఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు మాజీ ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, గుండురాజు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్‌గా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నియమితులైన సందర్భంగా పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం బి.కోడూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, బి.కోడూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి, రవీంద్రారెడ్డి, కొండా వెంకటరామిరెడ్డి, ఓకిరి రామ్మోహన్‌రెడ్డి, పి.శేఖర్, కొండా సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



నాగభూషణంకు మెమెంటో అందిస్తున్న జేఏసీ నాయకులు

రాజుపాళెం : రాజుపాళెం విద్యాశాఖ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న నంద్యాల నాగభూషణం చేసిన సేవలను గుర్తించి ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నమ్మ ఫంక్షన్ హాల్‌లో జేఏసీ చైర్మన్ కాంతారావు, గౌరవ సభ్యులు ఏపీ నాగేశ్వరరావు సత్కరించారు. ఆఫీస్ ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై ఈ కార్యక్రమం చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి



బండి విజయభాస్కర్‌రెడ్డి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన సమాధి వద్ద మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి సతీమణి బండి సరస్వతి, కుమారులు బండి సానారెడ్డి, బండి బాల సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, రాజుపాళెం మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, శంకరాపురం నాగమునిరెడ్డి, టంగుటూరు విశ్వనాథరెడ్డి, కొత్తపేట రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామం సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో ఉన్న రవి అనే అనాథ ఆదివారం మృతి చెందాడు. వివేకానంద ఫౌండేషన్ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. నెలన్నర క్రితం ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌లో అచేనతంగా ఉన్న రవికి వివేకానంద సేవాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. రాజమండ్రికి చెందిన రవి ఆశ్రమంలో ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఈ మధ్యనే కాలు, చేయి పడిపోయి.. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఉండేవాడు. నిర్వాహకులు సపర్యలు చేసినా ఫలితం లేదని ఆశ్రమ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. సంప్రదాయ బద్ధంగా రవికి ఫౌండేషన్ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

శునకం.. సంకటం



గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు



కలసపాడులో గిద్దలూరు ప్రధాన రహదారిలో కుక్కల గుంపు

- కుక్కల దాడులతో బెంబేలెత్తుతున్న జనం
- బద్వేలు, కలసపాడులో నానాటికీ పెరుగుతున్న శునకాల సంఖ్య
- నియంత్రణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలం
- బెడద ఎప్పుడు తీరుతుందో తెలియక ప్రజానీకం సతమతం

బద్వేలు : సాధు జంతువులు అయిన కుక్కలు ఇప్పుడు క్రూర జంతువులుగా మారిపోయాయి. కుక్కకు ఉన్న విశ్వాసం నీకులేదు. దానికి పిరికెడు అన్నం పెడితే తోకాడిస్తూ నాకాళ్ల వద్దనే పడి ఉంటుంది. నీకు ఎంత చేసినా అంతే. కుక్కకు ఉన్న విశ్వాసం లేదు అనే గ్రామాల్లో పెద్దలు మాట్లాడే మాటలు జ్ఞాపకాలుగా మిగిలాయి. ఎందుకంటే ఇప్పుడు కుక్కలకు విశ్వాసం లేకుండా పోయింది. మనిషిని చూస్తే ఆమడదూరం పరిగెత్తే కుక్కలు ఇప్పుడు మనిషి మీదకు ఎగబడి దాడి చేస్తున్నాయి. దీనికంతటికీ కారణం ఇప్పుడు కుక్కలు మాంసం తినడం అలవాటు పడటమే. చికెన్ సెంటర్లు, హోటళ్ల దగ్గర చికెన్ వ్యర్థ పదార్థాలను అక్కడే రోడ్లపై వేయడంతో అవి తిన్న కుక్కలు క్రూరంగా మారిపోయి పిల్లలు, పెద్దలపై దాడికి తెగబడుతున్నాయి.

జనాలపై దాడులు

పల్లె, పట్టణం అనే తేడా లేకుండా శునకాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. కుక్కల సంతతిని నియంత్రిచడంలో ప్రభుత్వానికి ఒక స్పష్టతలేదు. వాటిని పట్టుకోవడానికి కొన్ని పంచాయతీల్లో నిధులున్నా ఖర్చుపెట్టడంలేదు. వాటికి కుటుంబ నియంత్రణ చికిత్స చేయడానికి పశుసంవర్ధకశాఖలో తగినంత సిబ్బందిలేదు. వెరసి ప్రజారోగ్యానికి భరోసాలేదు అన్నట్లుంది కలసపాడు, బద్వేలు పట్టణాల్లో పరిస్థితి. దీంతో బద్వేలు, కలసపాడు పట్టణాల్లో గ్రామ సింహాలు యథేచ్ఛగా గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రివేళల్లో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇటీవల బద్వేలు పట్టణంలో ఒకే రోజు శునకాలు 30 మందిపై, కలసపాడులో 15 మందిపై దాడిచేసి గాయపరిచిన విషయం మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులకు సమాచారం ఉన్నా వారు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం పాదచారుల వెంటే కాకుండా ద్విచక్ర వాహనదారుల వెంట పడుతుండటంతో ప్రమాదాల బారినపడుతున్నారు.

కలసపాడులో జంతు ప్రేమికుల అడ్డు

కలసపాడులో కుక్కల బెడద నానాటికీ పెరగడంతో భయాందోళనకు గురైన స్థానికులు గతంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసి కుక్కల బారీ నుంచి రక్షించాలని విన్నవించారు. స్పందించిన ఆమె కుక్కలు పట్టుకొని తీసుకుపోయే వారిని రప్పించింది. అయితే కుక్కల ప్రేమికులు, పలువురు యువత ఈ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కుక్కల దాడులు మరింత పెరగడంతో అసహనంతో మరోసారి ఎంపీడీఓకు సమస్యను తెలియజేయగా కుక్కలు పట్టుకునేందుకు గ్రామంలోనే కొందరు అడ్డుపడుతున్నారని తానేమి చేయలేనని చేతులెత్తేశారు. అయితే కుక్కల పంచాయతీ ఇంతటితో తెగకపోగా కడప కలెక్టరేట్ వరకు వెళ్లింది.

అటకెక్కిన ఏబీసీ పథకం

గతంలో కుక్కలు సంఖ్య నియంత్రించడానికి వాటికి ఇంజక్షన్లు ఇచ్చి హతమార్చేవారు. జంతు ప్రేమికుల నుంచి వ్యతిరేకత ఎదురుకావడంతో ఆ పద్ధతికి స్వస్తి పలికి వాటికి యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) పథకం పేరిట కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఒక్కో కుక్కకు ఏబీసీ చేయడానికి సుమారు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు అవుతుండటంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. ఆర్థిక ఇబ్బందులకు తోడు పశుసంవర్ధక శాఖలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో దానికి మంగళం పాడేశారు.

స్పందించని కమిషనర్, ఎంపీడీఓ

కుక్కల బెడద విషయమై బద్వేలు మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల వెంకట నరసింహారెడ్డిని, కలసపాడు ఎంపీడీఓ మహబూబీని వివరణ కోసం ఫోన్‌కాల్‌లో ప్రయత్నించగా రింగ్ అవుతున్న స్పందించడం లేదు.ఈ విషయమై ఉన్నత అధికారులు వారిపై చర్యలు తీసుకోవలసి ఉంది.

కుక్క కాటును నిర్లక్ష్యం చేయకూడదు

పెంపుడు కుక్కలైనా.. వీధి కుక్కలైనా కరిచిందంటే నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే రేబిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. కుక్క కరిచిన చోట వెంటనే కొళాయి కింద శుభ్రపరుచుకుని పసుపు రాయాలి. ఆ తరువాత వెంటనే చికిత్స చేయించుకోవాలి. గ్రామాల్లో చాలా మంది వీధికుక్కల కాటు మాత్రమే ప్రమాదమనుకుంటారు. పెంపుడు కుక్కల కాటు కూడా ప్రాణాంతకమే. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి.

\- చెన్నారెడ్డి, పశువైద్యాధికారి, వెంకటాపురం

గాంధేయ మార్గంలో శాంతియుత నిరసన

- మున్సిపల్ ఆఫీసు నుంచి ర్యాలీ
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : నకిలీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి జమ్మలమడుగు రోడ్డులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ గాంధేయ మార్గంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎవరిని దూషించకుండా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. నకిలీ మద్యం తయారీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్న కారణంగా పేద ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులు కార్యక్రమానికి తరలి రావాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం తాగి ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలు చనిపోవడం, అనారోగ్యానికి గురికావడం జరుగుతోందన్నారు. ప్రభుత్వంపై నకిలీ మద్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం

అట్లూరు : కల్తీ మద్యంతో కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలను బలిగొంటోందని, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టే నిరసన కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. ఎన్ బ్రాండ్ కల్తీ మద్యంతో ప్రాణాలు తీసుకున్న కూటమి ప్రభుత్వం నుంచి రక్షణ కల్పించేందుకు ఉదయం 9 గంటలకు బద్వేలు పట్టణం సిద్ధవటం రోడ్డు ఎన్జీఓ కాలనీ వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి మహిళలు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ శాఖ అధికారికి వినతి పత్రం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ ఏరియా కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

మూతపడిన రైతు సేవా కేంద్రాలు



మూతపడి ఉన్న గోపవరం రైతుసేవా కేంద్రం

గోపవరం : మండలంలో బేతాయపల్లె మినహా అన్ని రైతుసేవా కేంద్రాలు మూతపడ్డాయి. సిబ్బంది లేరని సాకుగా చూపి కేంద్రాలను మూసివేశారు. మండలంలో కాలువపల్లె, గోపవరం, బేతాయపల్లె, రాచాయపేట, టీ.సండ్రపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సిబ్బంది ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఉద్యోగుల బదిలీల్లో రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో సిబ్బందిని నియమించకపోవడంతో ఆయా కేంద్రాలు మూతపడ్డాయి. ఒక్క బేతాయపల్లె కేంద్రంలో మాత్రమే వీఏఏ పనిచేస్తున్నారు. ప్రస్తుతం పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బోర్ల కింద వరిపంట సాగులో ఉంది. ఈ నేపథ్యంలో పంటలకు కావాల్సిన ఎరువులు ఏవీ కూడా రైతులకు అందుబాటులో లేవు. కనీసం యూరియా కూడా రైతులకు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. గతంలో ఎరువులు, పురుగు మందులు అన్నీ కూడా రైతుసేవా కేంద్రాల ద్వారానే రైతులు తీసుకునేవారు. ఇప్పుడు కేంద్రాలు మూతపడి ఉండటంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఉన్నారు. మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయం కూడా మూతపడి ఉంది. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో లేకపోవడంతో ఏ చిన్న అవసరం వచ్చినా రైతులు బద్వేలుకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మూతపడిన రైతుసేవా కేంద్రాలను తెరిపించడంతో పాటు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రైతుసేవా కేంద్రాలకు కొరవడిన భద్రత

నెలల తరబడి రైతుసేవా కేంద్రాలు మూతపడి ఉండటంతో వాటికి భద్రత కొరవడింది. గ్రామాలకు చివరలో గ్రామ సెక్రటరేట్ కార్యాలయాలు ఉన్నందున అక్కడ ఎలాంటి సెక్యూరిటీ లేదు. రైతుసేవా కేంద్రాలు సిబ్బంది లేక మూతపడ్డాయి. అవి తెరిచే పరిస్థితి లేకపోవడంతో ప్రస్తుతం ఆ కేంద్రాలనే టార్గెట్ చేస్తున్నారు. అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఎల్‌ఈడీ టీవీతో పాటు కంప్యూటర్, ప్రింటర్లు ఉన్నాయి. ఇప్పటికే గోపవరం రైతుసేవా కేంద్రంలో ఎల్‌ఈడీ టీవీ, ప్రింటర్‌ను తాళం పగులకొట్టి దొంగలు ఎత్తుకెళ్ళారు. విలువైన పరిసరాలు ఉండటంతో ఆ కేంద్రాలను టార్గెట్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రైతుసేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి విలువైన సామాగ్రిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

బద్వేలు అర్బన్ : విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేసేవరకు, వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులైషన్స్ ఇంప్లిమెంట్ చేసి గ్రేడ్-2 కార్మికులకు న్యాయం చేసేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. అలాగే ఉద్యోగుల డీఏ విడుదల చేయాలని, కారుణ్య నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలని, నగదురహిత అపరిమిత మెడికల్ పాలసీని వర్తింపజేయాలని, కాంట్రాక్టు కార్మికులకు కోటి రూపాయలు ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. ఇప్పటికైనా విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు శాంతియుత వాతావరణంలో పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 15వ తేదీ నుంచి జరిగే సమ్మెకు మద్దతు తెలియజేసి ముందుండి పోరాడతామన్నారు. సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మైదుకూరు డివిజన్ కార్యదర్శి పి.సి.కొండయ్య, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, బద్వేల్ సబ్ డివిజన్ కార్యదర్శి అబ్దుల్‌రహీం, కమిటీ నాయకులు మురళీధర్‌రెడ్డినాయుడు, ఓబులేసు, వెంకటేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాకు పాల్పడితే చర్యలు



ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రమణారెడ్డి

మైదుకూరు : గంజాయి తదితర నిషేధిత మత్తు పదార్థాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల యజమానులను హెచ్చరించారు. పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోదాములు, ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని సీఐ రమణారెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తుపదార్థాలను పూర్తిగా కట్టడిచేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారని సీఐ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ కార్గో, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ కంపెనీల గోదాముల్లో తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల నిర్వాహకులకు సూచించారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన పోటీలో విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఇస్కాన్ కేంద్రంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా విద్యార్థులకు ఇస్కాన్, దామోదర లీల అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలుతోపాటు 20 ప్రోత్సాహక బహుమతులను దీపావళి పండుగ రోజున అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను ఇస్కాన్ ప్రతినిధులు వసుమన వెంకటదాస్, భక్త శబరీష్, భక్త యశ్వంత్, అధ్యాపకులు పర్యవేక్షించారు.

విద్యార్థులు సేవా భావం అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు మండలంలోని మత్స్య కాలనీలో స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. అందులో భాగంగా మత్స్యకాలనీలోని ఎంపీపీ స్కూల్ ఆవరణలోని కంప చెట్లను తొలగించడం, ప్లాస్టిక్ వస్తువుల ఏరివేత, గ్రామ సచివాలయం, డివైడర్‌లలో గడ్డిని తొలగించడం, పర్యావరణ పరిరక్షణ ర్యాలీ, జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏసీ వెంకటరాముడు వివరించారు. స్పెషల్ క్యాంప్ చివరి రోజు ఆదివారం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గడియారం వేంకట శేషశాస్త్రి విగ్రహావిష్కరణ



'గడియారం' విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో ఆదివారం శ్రీ శివభారతి విద్యాపీఠం ఆధ్వర్యంలో మహా కవి డాక్టర్ గడియారం వేంకటశేష శాస్త్రి విగ్రహాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడియారం రచించిన 'శ్రీ శివ భారతం' మహాకావ్యం ఆయనకు ఎనలేని కీర్తిప్రతిష్టలు తెచ్చిందన్నారు. బ్రిటీష్ వారి పాలనా కాలంలో దేశ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా శివాజీ మహారాజ్‌పై గడియారం రచించిన ఈ కావ్యం ఆంగ్లేయులపై వీర గాథ అన్నారు. తాను 1954- 60 ప్రాంతంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకునే సమయంలో తెలుగు బోధించేవారని గుర్తుచేశారు. తనకు విద్యను నేర్పించిన గడియారం విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. ప్రాసమణి బిరుదాంకితుడు అన్నదాత సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను గడియారం విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, వ్యాపారవేత్త కామరాజు దండపాణి, దండపాణి శ్రీనివాసకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మారెళ్ల మల్లికార్జునరావు, శివభారతి విద్యాపీఠం అధ్యక్షుడు గడియారం నాగేశ్వరశర్మ, కార్యదర్శి గడియారం వేంకట శేషశర్మ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్.నారాయణరెడ్డి, గడియారం కుటుంబీకులు, కవులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



విజయ్‌ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని మైదుకూరు రోడ్డుకు చెందిన వెన్నపూసపల్లె అలవలపాటి విజయ్ ప్రసాద్ రెడ్డి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయ్ ప్రసాద్ రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను రాత్రి పొద్దుపోయినా ఇంటికి తిరిగి రాలేదు. పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అరుణ్ రెడ్డి తెలిపారు.

రైతుల సమస్యకు పరిష్కారం

మైదుకూరు: మండలంలోని వనిపెంట రైతుల సమస్యను అధికారులు ఆదివారం పరిష్కరించారు. వనిపెంట నుంచి చెర్లోపల్లెకు వెళ్లే రహదారిలో మురికి గోవిందమ్మ, సంజీవరాయుడు తదితర రైతులకు చెందిన అరటి, పసుపు, ఉల్లి పంటలు నీట మునిగిన విషయంపై ఆదివారం సాక్షిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశాలతో మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, వనిపెంట రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1647, 1648లోని పొలాలను పరిశీలించారు. సుమారు 20 ఎకరాలలోని నీరు దిగువకు వెళ్లే మార్గం లేక పొలాల్లో నిలిచిందని గుర్తించారు. దిగువ పొలాల రైతులతో మాట్లాడి నీరు దిగువకు వెళ్లేలా కాలువలు తీసేందుకు ఒప్పించారు. బాధిత రైతులు రెండు జేసీబీలను తెప్పించి కాలువలు తీయించడంతో నీరు దిగువ వంకలోకి వెళ్లిపోయింది.

క్రమశిక్షణకు మారుపేరు ఆర్ఎస్ఎస్

చాపాడు : వందేళ్ల కిందట ఆవిర్భవించిన ఆర్ఎస్ఎస్ దేశ భక్తి, క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు గూడూరు రవి కుమార్ తెలిపారు. మండలంలోని వెదురూరు శివాలయంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందుత్వం కోసం వెలసిన ఆర్ఎస్ఎస్ సమాజ హితం కోసం పనిచేస్తోందన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి, వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

మైదుకూరు : జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వనిపెంట జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. సంజీవపురంలో జరిగిన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పి.కుసుమ, 9వ తరగతి విద్యార్థిని బి.దివ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. అదే విధంగా 9వ తరగతి విద్యార్థిని హిమబిందు స్టాండ్‌బైకి ఎంపికైనట్లు తెలిపారు.

బెంచీలు వితరణ

కలసపాడు : కలసపాడుకు చెందిన ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ఎస్.వి.సత్యనారాయణ సామాజిక సేవలో భాగంగా స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం, అంకాలమ్మ ఆలయం, ప్రకాశం జిల్లా తాడిచెర్లమోటు వద్ద ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సుమారు రూ.61 వేలు విలువ చేసే 15 సిమెంటు బెంచీలు వితరణ చేశారు.

రైతుల గోడు కూటమి ప్రభుత్వానికి పట్టదా?

వైఎస్సార్‌సీపీ రైతు జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి



రాజుపాళెం : రైతులు పండించిన దిగుబడులు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని గతంలో సీఎం చంద్రబాబు చెప్పారని, అయితే ఆ కేంద్రాలు ఎక్కడున్నాయో కనిపించడం లేదని వైఎస్సార్‌సీపీ రైతు జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన రాజుపాళెంలో ఆదివారం మాట్లాడుతూ అరటి, బొప్పాయి, ఉల్లి పంటల దిగుబడులకు కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేశామని మాటలకే పరిమితమైందన్నారు. అయితే పంటల దిగుబడులు పూర్తవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదని విమర్శించారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లిన దాఖలాలు కూడా లేవన్నారు. ప్రజా ప్రతినిధులు పల్లెలోకి వెళితే రైతులు నిలదీసే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారని, పంటలు పండించాక దిగుబడులు అమ్ముకోలేక వాటిని పొలాల్లోనే వదిలేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం పంటలు సాగు చేసిన రైతులకు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే విద్యుత్ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా నిలువునా మోసం చేసిందన్నారు. ఇప్పటికే విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేసి ఈనెల 15 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించినప్పటికీ కూటమి ప్రభుత్వ పెద్దలకు సమస్యలను పరిష్కరించి సమ్మెను ఆపుదామన్న ఆలోచన లేకపోవడం దుర్మార్గమన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కోతలు అధికమయ్యాయన్నారు. సమావేశంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు వినియోగించుకోవాలి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ రోటరీ సేవలను వినియోగించుకోవాలని 3,160 రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంకే రవీంద్ర కోరారు. ఆదివారం స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో రోటరీ క్లబ్, మిడ్ టౌన్ రోటరీ క్లబ్, రోటరీ కంటి ఆస్పత్రి, శ్రీశ్రీహోలిస్టిక్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పోలియో నిర్మూలనకు రోటరీ ఇంటర్నేషనల్ కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 256 మందికి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీబీఐటీ నోవో రోటరాక్ట్ క్లబ్‌ను ఆవిష్కరించారు. గవర్నర్ ఏంకే రవీంద్ర దంపతులకు ఈ సందర్భంగా రోటేరియన్స్ తరపున రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పినాకిని జోన్ అసిస్టెంట్ గవర్నర్ కేవీ మురళీధర్‌రెడ్డి, రోటరీ క్లబ్ సెక్రటరీ షేక్ బాబా, ట్రెజరర్ దొంతు బాలాజీ, వంకధార నరసింహారావు, జాకీర్ అహ్మద్, నాగశయనం, పాలగిరి ఖాదర్‌బాషా, మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తిరుపతయ్య, సెక్రటరీ బీవీ రాజు, ట్రెజరర్ పోలంకి వరదరాజులు, హోలిస్టిక్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ నరసింహారావు, పీఆర్ఓ ప్రతాప్, సాధు గోపాలకృష్ణ, కొవ్వూరు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.